క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



నెల్లూరు(సెంట్రల్): పెంచలకోనలో మే ఒకటి నుంచి నిర్వహించనున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిశారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పలువురు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు అందజేశారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



కోవూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో రాణించాలని, తాము చదువుతున్న పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి 14 మంది పాల్గొనగా వారిలో 12 మంది బాలికలు కోవూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులని తెలిపారు. వీరంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, రజత పతకాలు సాధించారన్నారు. భవిష్యత్‌లో వీరు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే స్మాష్ రాకెట్ క్రీడలో ఇటీవల జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు మహిళల విభాగంలో 3వ స్థానం, పురుషుల విభాగంలో 4వ స్థానంలో నిలిచారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.నరసింహమూర్తి, విశ్రాంత పీఈటీ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ ఎం.దేవిక, పీఈటీ సుబ్బమ్మ పాల్గొన్నారు.

రైతు వికాస పథకంతో అన్నదాతకు సహకారం

కొడవలూరు: రైతు వికాస పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. రైతు వికాస పథకం ద్వారా గుండాలమ్మపాళెం సొసైటీ పరిధిలో మంజూరైన రూ.30 లక్షల రుణాల చెక్కులను మండలంలోని నార్తురాజుపాళెం వీసీఆర్ అతిథి గృహంలో గురువారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటివరకు రూ.10 కోట్లకు పైగా దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను రైతులకు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు సొసైటీల ద్వారా విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించేలా చర్యలు తీసుకొంటోందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ అనికేపల్లి కృష్ణప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో పురుగుమందులు వాడొద్దు

పొదలకూరు: నిమ్మతోటల యాజమాన్య పద్ధతుల్లో రైతులు అధిక మోతాదులో పురుగుమందులను వాడవద్దని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి సూచించారు. 'వేసవి కాలంలో నిమ్మసాగు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై స్థానిక వ్యవసాయశాయ పరిశోధనా స్థానంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుబ్బారెడ్డి మాట్లాడుతూ తోటల్లో చిన్నపాటి తెగుళ్లు వస్తే రైతులు ఆందోళన చెంది పురుగుమందులను పిచికారీ చేయకూడదని, ప్రతి ఏడాది నిమ్మతోటల్లో పచ్చిరొట్ట ఎరువులను వేస్తే వేరుకుళ్లు తెగుళ్లు వ్యాప్తి చెందవని తెలిపారు. నిమ్మలో అంతర పంటల సాగు చేయవద్దని, మిర్చి, టమాటా, వంకాయ తదితర అంతర పంటల వల్ల నిమ్మ చెట్లు దెబ్బతింటాయని తెలిపారు. జీవనియంత్రణ ఎరువుల వాడకం వల్ల పనికొచ్చే బ్యాక్టీరియా ఉండేదన్నారు. ఇపుడు పైపాటుగా జీవనియంత్రణ ఎరువులను వేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్, వేపపిండి, పశువుల ఎరువులను కలియబెట్టి నిమ్మచెట్టు పాదిలో వేస్తే చెట్లు ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. వేసవిలో తోటల్లో తేమశాతం ఉండేలంటే ప్రతి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలని సూచించారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కవిత మాట్లాడుతూ అధికంగా పురుగుమందులను వాడకూడదన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యానాధికారుల సలహాలు, సూచనలు పాటించి తెగుళ్లకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఏపీఎంఐ పీడీ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రిప్ ద్వారా ఎరువులను పంపి ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు.

స్వర్ణకారులకు అండగా ఉంటా

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వర్ణకారులకు అండగా ఉంటానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కామాటివీధిలోని సంతాన గోపాలకృష్ణ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ, స్వర్ణకార సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. స్వర్ణకారుల అభివృద్ధికి సంబంధించి నగరంలో స్థలాన్ని కేటాయించనున్నామని చెప్పారు. కనీసం 600 నుంచి 700 మంది వ్యాపారం చేసుకునేలా నిర్మించాలని, ఈ విషయమై అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి ఎలా చేయాలనే అంశంపై ఆలోచిస్తున్నామన్నారు. స్థలాలను తాను పంచేస్తున్నానంటూ ఓ పత్రికలో వార్త రాశారని, ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న వారు భవన నిర్మాణానికి సహకరించాలని తనను కోరారని చెప్పారు. ఇందులో భాగంగానే బీసీ సంఘాలకు స్థలాన్ని కేటాయించామని తెలిపారు. 2024 ఎన్నికల్లో తనను, జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. సంక్షేమ సంఘ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గోపీ, కార్పొరేటర్లు రామకృష్ణ ఆచారి, వేలూరు మహేష్, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌కు సత్కారం

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను గురువారం నిర్వహించారు. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు వివిధ డిగ్రీలు పొందిన 600 మంది హాజరుకాగా, 150 మందిని ఎంపిక చేశారు. టెక్ మహేంద్ర సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ షబీనా కంపెనీ ప్రతినిధిగా హాజరయ్యారు. కరస్పాండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, సీఈఓ రాజాయాదవ్, హెచ్‌ఆర్ ప్రతినిధి ఫణి పూజిత్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్‌వేలు, ప్రిన్సిపల్ సోనాలి మన్నా, వైస్ ప్రిన్సిపల్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదలలో ఇబ్బందులు తలెత్తకూడదు



నెల్లూరు(సెంట్రల్): వెంకటగిరి నియోజకవర్గంలో నీటి పారుదల విషయంలో ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. తెలుగుగంగ ప్రాజెక్ట్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశాన్ని నగరంలోని తన నివాసంలో గురువారం నిర్వహించారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ ఈఈ రాధాకృష్ణ, ఏఈ తిరుమలయ్య, డీఈ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



నెల్లూరు (అర్బన్): చాకలివీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌హెచ్‌ఎం విభాగ డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్ గురువారం తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలు, కోవిడ్ శాంపిల్స్, ఇతర రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

నెల్లూరు రూరల్: రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ మలోల ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.
సమస్యల పరిష్కార విషయంలో తగిన విధంగా స్పందించాలని కోరారు. అనంతరం రెవెన్యూపరమైన పలు అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు.



మాట్లాడుతున్న మలోల

కార్పొరేట్‌కు దీటుగా కార్పొరేషన్ కళాశాల

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కార్పొరేట్‌కు దీటుగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారని కమిషనర్ వికాస్ మర్మత్ కొనియాడారు. ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన మున్సిపల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ కళాశాలను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టనున్నామని వివరించారు. తాను విద్యనభ్యసించే సమయంలో చదువులో సహకరించే స్నేహితులతో గడిపేందుకు అధిక సమయాన్ని కేటాయించేవాడినని, ఈ కారణంగానే తాను ఐఏఎస్ కాగలిగానని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అభినందనలను తెలియజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శివరామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న వికాస్ మర్మత్

ఇంటర్‌లో 'వర్ధన్‌రెడ్డి' విజయకేతనం



నెల్లూరు (టౌన్): ఇంటర్ ఫలితాల్లో వర్ధన్‌రెడ్డి కళాశాల విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి సంబరాలు జరుపుకొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో అనూరాధ 465, ఆర్షియా, హంసిని 464, ద్వితీయ సంవత్సరంలో దేవీప్రియ 987, శ్రీలక్ష్మి 985, నందన్‌రెడ్డి 982, శివశంకర్‌రెడ్డి 981 మార్కులను సాధించారని వెల్లడించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో మదన్‌కుమార్ 427, ఉల్లాసిని 424, ద్వితీయ సంవత్సరంలో హార్దిక్ 971, జోసఫ్ సాగర్ 967 మార్కులను సాధించారని పేర్కొన్నారు.

సీపీఎం ప్రచార భేరి



నెల్లూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా 31వ డివిజన్లోని రామకోటయ్యనగర్‌లో ప్రచార భేరి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ నేతలు ప్రసాద్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఐదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): మద్యం మత్తులో మహిళపై దాడి చేసి గాయపర్చిన కేసులో నేరం రుజువు కావడంతో తోటపల్లిగూడూరు మండలం పాత కోడూరుకు చెందిన వెంకటేశ్వర్లుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1700 జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం పాతకోడూరుకు చెందిన సుగుణమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. 2017, నవంబర్ 27న రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు మద్యం మత్తులో ఆమె ఇంటికెళ్లి తలుపు తట్టారు. అనంతరం అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె వారించారు. దీంతో కోపంతో ఆమె తలపై కర్రతో కొట్టి గాయపర్చి పారిపోయాడు. చికిత్స నిమిత్తం ఆమెను నెల్లూరులోని ఆస్పత్రికి కుమారుడు జయప్రకాష్ తరలించారు. సుగుణమ్మ ఫిర్యాదు మేరకు తోటపల్లిగూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితుడిపై చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ప్రసాద్ కేసు వాదించారు.

చెస్ కోచ్ సుమన్‌కు అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చెస్ కోచ్ సుమన్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం సత్కరించారు. అక్షర విద్యాలయ కరస్పాండెంట్ దీపా వెంకట్, ప్రధానోపాధ్యాయురాలు కుముద, ప్రియా, ట్రస్ట్ నిర్వాహకుడు జనార్దన్‌రాజుకు కృతజ్ఞతలను సుమన్ తెలియజేశారు.

5న సంగీత, నృత్య పోటీలు



నెల్లూరు(బృందావనం): ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులు.. సంగీత, నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన కళాకారులను సత్కరించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంగీత, నృత్య పోటీలను మే ఐదున నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 77299 42543 నంబర్‌ను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. మేదర సంఘ నేతలు ప్రభాకర్, జగన్ పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. దత్తాత్రేయ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ప్రాకారోత్సవాన్ని రాత్రి నిర్వహించారు. ఉభయకర్తగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

సరస్వతీదేవిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక వసంత పరిమళ కొత్తాయి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, పద్మ, సుబ్బారావు, అనూష దంపతులు వ్యవహరించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనల మేరకు ఉషోదయాన వీధి వీధికీ మీ కర్తం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. పద్మావతినగర్, వేపదొరువు, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇందిరా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు.

జగన్మాత కనుసన్నల్లోనే త్రిమూర్తుల లోకపాలన



ప్రవచిస్తున్న శ్రీమన్నారాయణమూర్తి

నెల్లూరు(బృందావనం): జగన్మాత కనుసన్నల్లోనే లోకాలను త్రిమూర్తులు పాలిస్తున్నారని, శంకరభగవత్పాదుల వారు తెలిపిన సౌందర్యలహరి ద్వారా ఈ విషయం స్పష్టమవుతోందని ప్రముఖ ఉపన్యాసకుడు మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచించారు. నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఆదిశంకర జయంత్యుత్సవాలను పినాకినీ విద్యాపీఠ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సౌందర్యలహరిపై గురువారం ఆయన ప్రవచించారు. జగజ్జనని లలితాపరమేశ్వరి నివాసం మణిద్వీపమని శంకరభగవత్పాదుల వారు వివరించారన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శంకరభగవత్పాదుల వారికి పుష్పార్చనలను నిర్వహించారు. అనంతరం యజుర్వేద పారాయణాన్ని జరిపారు. పినాకినీ విద్యాపీఠ నిర్వాహకులు శ్రీనివాసులు, వెంకటలక్ష్మీనరసింహం, ప్రభాకర్‌రావు, బాలాత్రిపురసుందరి, సుందరశర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని వినతి

నెల్లూరు (వేదాయపాళెం): ఆస్తిని తీసుకొని తనపై దౌర్జన్యం చేస్తున్న కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని నవాబుపేటకు చెందిన పద్మమ్మ కోరారు. సుబేదారుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన గోడును వెళ్లబోసుకున్నారు. మైపాడు గేట్ సెంటర్‌లోని శ్రీనివాసనగర్‌లో తన కష్టార్జితంతో సంపాదించుకున్న 32 అంకణాల స్థలంలో నివసిస్తున్నానని చెప్పారు. భర్త మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్నానన్నారు. తన కుమారుడు, కుమార్తెకు వివాహాలు చేసి ఆస్తులను పంచానని చెప్పారు. తాను ఉంటున్న ఇంటి స్థలాన్ని సైతం తనకు ఇవ్వాలంటూ కుమారుడు, కోడలు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. స్థలానికి డూప్లికేట్ డాక్యుమెంట్లను సృష్టించి తనను బయటకు గెంటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): కోర్టు విధులను న్యాయవాదులు శుక్రవారం బహిష్కరించనున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌రెడ్డి, అన్వర్‌బాషా తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.
విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది హరిరామ్‌పై దుండగులు దాడి చేయడాన్ని ఖండిస్తూ కోర్టు విధులను బహిష్కరించాలని తీర్మానించామని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.